
సాక్షి ఇంటర్వ్యూ

వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే..
స్టీల్‌ప్లాంట్ గెలిచినట్లే..



నేను పక్కా లోకల్

- కూటమి గెలిస్తే స్టీల్‌ప్లాంట్‌కు ఓటమే..
- స్టీల్‌ప్లాంట్‌ను, నిర్వాసితులను ఆదుకున్న ట్రాక్ రికార్డు వైఎస్ కుటుంబానిది
- అనకాపల్లిని రూ.1550 కోట్లతో అభివృద్ధి చేశా
- గాజువాక ప్రగతికి నా ప్రణాళిక ఇప్పటికే చెప్పాను
- యువత ఉపాధి కోసం 'విజయ వారధి'
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గాజువాక : ఈ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ గెలుస్తుందని, కూటమికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్ ఓటమి చెందుతుందని వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న ఈ పరిశ్రమను కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామన్నారు.

తమ నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒప్పుకో లేదు కాబట్టే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయం ముందుకు సాగలేదన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన లేక పోతే ఈపాటికే ఈ కర్మాగారాన్ని అమ్మేసేవారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

> **గాజువాకలో ప్రతి సమస్యా తెలుసు**
>
> నేను పక్కా లోకల్. ఎక్కడి నుంచో ఇక్కడికి వలస రాలేదు. రాజకీయంగా అనకాపల్లిలో పోటీ చేసి గెలిచాను. ఇప్పుడు నా సొంత గడ్డపై పోటీ చేస్తున్నాను. అనకాపల్లి నియోజకవర్గాన్ని రూ.1550 కోట్లతో అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా తీర్చి దిద్దాను. గాజువాక సమస్యలు చిన్నప్పటి నుంచి తెలిసినవాడిని. అన్ని సమస్యలను పరిష్కరిస్తాను. దీనికోసం నావద్ద సహేతుకమైన ప్రణాళిక ఉంది. ముఖ్యమంత్రితో నాకున్న సాన్నిహిత్యం వల్ల ఇక్కడి సమస్యలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉంది. అమర్‌ను గెలిపిస్తే ఆయన ద్వారా మంచి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గాజువాక సభలో చెప్పిన విషయం మీ అందరికీ తెలిసిందే.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కచ్చితంగా అడ్డుకుంటాం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చాలా స్పష్టంగా ఉన్నారు. ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయగానే మా ప్రభుత్వం దానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని పరిశ్రమల శాఖ మంత్రిగా నేనే ప్రవేశపెట్టాను. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా ప్రధానమంత్రికి లేఖ రాసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. విశాఖలో నిర్వహించిన ఒక సభలో కూడా ఈ విషయంపై ప్రధాన మంత్రికి సీఎం నేరుగా చెప్పారు. ఈ పరిస్థితుల్లో మేం గెలిస్తే ప్రైవేటీకరణను కచ్చితంగా అడ్డుకుంటాం.

స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, నిర్వాసితులను ఆదుకున్న ట్రాక్ రికార్డు వైఎస్ కుటుంబానికి మాత్రమే ఉంది. ఆ కుటుంబం తప్ప మరెవరూ న్యాయం చేయలేదు. గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదుకున్నారు. స్టీల్‌ప్లాంట్ రిక్రూట్‌మెంట్‌లో నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగాలను గ్యారంటీ చేసి జీవో ఇచ్చారు. ఇప్పుడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగన్ మోహన్‌రెడ్డి నిలబడ్డారు. ఈ కర్మాగారాన్ని కాపాడుకుంటే నిర్వాసితుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఒకవేళ ప్రజలు కూటమికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను కచ్చితంగా ప్రైవేటీకరిస్తారు. దీనివల్ల నిర్వాసితులే కాక ఈ ప్రాంతం మొత్తం నష్టపోతుంది.

పరిశ్రమల ఏర్పాటు.. : గాజువాక నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. భవిష్యత్‌లో ఇక్కడ మరిన్ని పరిశ్రమలను నెలకొల్పడానికి కృషి చేస్తాను. డిజిటల్ మీడియా, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, లాజిస్టిక్ హబ్, క్లీన్ మ్యానుఫ్యాక్చరింగ్, టెక్ బీపీవో వంటి కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం. అందులో యువతకు ఉపాధి కల్పిస్తాం.

ప్రభుత్వ కళాశాలల ఏర్పాటు

మా ప్రభుత్వం వచ్చిన తరువాత గాజువాకలోని కొన్ని హైస్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశాం. వీటితో పాటు కొత్తగా గాజువాకలో ప్రభుత్వ డిగ్రీ, డిప్లమా, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేస్తాం. యువతకు పోటీ పరీక్షల్లో శిక్షణ కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం.

వసతుల ఏర్పాటుకు చర్యలు

గాజువాక మార్కెట్‌ను సకల వసతులతో ఆధునికీకరిస్తాం. దశలవారీగా అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. డ్రైనేజీలను అవుట్‌లెట్‌లకు, పెద్ద కాలువలకు అనుసంధానం చేస్తాం. కొండవాలు ప్రాంతాలు, గెడ్డల వద్ద రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తాం.

టూరిజం అభివృద్ధి, రిక్రియేషన్

గాజువాక ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి కూడా అవకాశాలను పరిగణనలోకి తీసుకున్నాం. యారాడ బీచ్‌ను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. పాత పార్కులను పునరుద్ధరించి వ్యాయామాలకు, వాకింగ్‌కు అనుకూలంగా ఉండే విధంగా వసతులను అందుబాటులోకి తెస్తాం. రాత్రిళ్లు నిర్దేశిత సమయంలో వరకు ఫ్రీ జోన్‌లతో కూడిన ఫుడ్ జోన్ (డ్రైవ్ ఇన్)లకు అనుమతులు ఇప్పిస్తాం.

25వేల ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక

వివిధ పరిశ్రమలలో 25 వేల మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించాలనేది మా ధ్యేయం. దీనికోసం విజయవారధి అనే ఒక కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నాం. దీని ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంచుతాం. అనంతరం వారికి సరిపడిన ఉద్యోగాన్ని కల్పించడానికి కృషి చేస్తాం. శిక్షణ అనంతరం ఎవరైనా స్వయం ఉపాధి వైపు ఆలోచిస్తే వారిని ఆ రంగంలో ప్రోత్సహిస్తాం. వారు రుణ పథకాలను పొందడం కోసం సహకరిస్తాం.

అవీ.. ఇవీ

- వాయు, భూగర్భ జలాల కాలుష్య సమస్యల నియంత్రణ, ప్రత్యేక పరికరాలతో పర్యవేక్షణ, అత్యధిక స్థాయిలో చెట్ల పెంపకం
- సాంస్కృతిక కార్యక్రమాలకు, శుభకార్యాలకు భారీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం
- ప్రతి ఏటా నిర్దేశిత తేదీన గాజువాక ఉత్సవ్ నిర్వహణ
- మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి, నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

ఆడుదాం గాజువాక

గాజువాకలో ప్రతి ఏటా స్పోర్ట్స్ క్యాలెండర్‌ను విడుదల చేసి వివిధ క్రీడలతో గాజువాక ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తాం. బ్యాడ్మింటన్, బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల కోసం, స్విమ్మింగ్ పూల్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తాం. క్రీడా మైదానాలను పునరుద్ధరించి ఆసక్తిగల యువతకు క్రీడా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

ట్రాఫిక్ సమస్యపై స్పెషల్ ఫోకస్

గాజువాకలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రోడ్ల విస్తరణ చేపట్టడంతో పాటు వాహనాల రద్దీ నియంత్రణ కోసం అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తెస్తాం. సీఎంఆర్ సెంట్రల్, హైస్కూల్ రోడ్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం వద్ద పాదచారుల కోసం ఫుట్ ఓవర్ వంతెనలను నిర్మిస్తాం. పాతగాజువాక నుంచి శ్రీనగర్ వరకు ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి చర్యలు చేపడతాం. అగనంపూడి టోల్‌గేటు తరలింపునకు పోరాడుతాం. మెట్రోరైల్ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించి కొలిక్కి తెస్తాం. మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మించడంతో పాటు బస్ షెల్టర్లను ఆధునికీకరించి ఏసీ బస్ స్టాప్‌లను ఏర్పాటు చేస్తాం.

క్లుప్తంగా

చిన్మయానంద జయంతి వేడుకలు రేపు

ఉక్కునగరం: చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చిన్మయానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా 'చిన్మయ శంకరం' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చిన్మయ మిషన్ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు కూర్మన్నపాలెం అన్నపూర్ణ థియేటర్ సమీప శ్రీకృష్ణ ఈడెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో పాదుకా పూజ, భజనలు, కోలాటం, భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న పవర్ గ్రిడ్ సీనియర్ జీఎం రావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పవర్ గ్రిడ్ మెయిన్ గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ టి.ఎస్.సి.రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తాపం దృష్ట్యా చల్లని మజ్జిగ అందుబాటులో ఉంచామని, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ డీజీఎం వి.కె. చంద్రసేన్, చీఫ్ మేనేజర్ పేకా రాజు, మేనేజర్ అమరదీప్, వెంకటరాజు, గౌరీ శంకర్రావు, అబ్దుల్ రవూఫ్, పైల అప్పారావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలు వాయిదా వేయాలి'

ఉక్కునగరం: గాజువాక అసెంబ్లీ పరిధిలోని గంగవరం ప్రాంతంలో శాంతిభద్రతలు సజావుగా లేనందున విశాఖ పార్లమెంట్, గాజువాక అసెంబ్లీ ఎన్నికలు వాయిదా వేయాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్లను మెయిల్ ద్వారా కోరారు. గంగవరం పోర్టులో నిలిచిపోయిన స్టీల్‌ప్లాంట్ ముడి పదార్థాల రవాణా అంశంలో తలెత్తిన సమస్యలపై హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అవి ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఈ పరిస్థితుల్లో సుమారు గంట్యాడ, గంగవరం, దిబ్బపాలేనికి చెందిన 500 కుటుంబాలు ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. శాంతిభద్రతలు మెరుగయ్యే వరకు ఎన్నికలు వాయిదా వేయాలని కోరారు.

ప్రచార పర్వం



వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌కు మద్దతుగా 74వ వార్డు దల్లివానిపాలెంలో ప్రచారం చేస్తున్న గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ - పెదగంట్యాడ



వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు మద్దతుగా 77వ వార్డు పిట్టవానిపాలెంలో ప్రచారం చేస్తున్న బట్టు పైడిరెడ్డి, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు - పెదగంట్యాడ



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి రాజశేఖర్, వార్డు ఇన్‌చార్జి రావాడ శివ నేతృత్వంలో ప్రచారం చేస్తున్న ఎన్.రమేష్ కుమార్, కె.అమ్మాజీ తదితరులు - ఉక్కునగరం



87వ వార్డు వడ్లపూడి నిర్వాసిత కాలనీ దుగ్గపువానిపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, దామోదర్, చిత్రాడ వెంకట రమణ, గాలి ఆనంద్ తదితరులు - గాజువాక

బొగ్గు రవాణాకు అంగీకరించండి



ప్లకార్డులతో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు

- స్టీల్‌ప్లాంట్ యువ కార్మికుల అభ్యర్థన
- గంగవరం పోర్టు వరకు ప్లకార్డులతో ర్యాలీ

ఉక్కునగరం: గంగవరం పోర్టులో ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన బొగ్గును స్టీల్‌ప్లాంట్‌కు రవాణా చేయడానికి అంగీకరించాలని స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులను అభ్యర్థించారు. గత నెల 12 నుంచి గంగవరం పోర్టులో తలెత్తిన కార్మిక వివాదం వల్ల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన లక్షల టన్నుల బొగ్గు, ఇతర ముడి పదార్థాల రవాణా నిలిచిపోయింది. బొగ్గు కొరత వల్ల స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ బ్యాటరీల పరిస్థితి అత్యంత క్లిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో యువ కార్మికులు ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ర్యాలీగా గంగవరం పోర్టుకు ప్లకార్డులతో చేరుకున్నారు. అక్కడున్న గంగవరం పోర్టు నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని బొగ్గు రవాణాకు అనుమతించాలని కోరారు. తమ కుటుంబాల భవిష్యత్తు పూర్తిగా స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉన్నందున మానవతాదృక్పథంతో సహకరించాలని కోరారు. దీనిపై గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే తమకు జిల్లా యంత్రాంగం నుంచి స్పష్టమైన హామీ లభిస్తేనే తాము అనుమతిస్తామని స్పష్టం చేశారు.

ఐక్య ఉద్యమాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



ఉక్కు దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా పోరాటాలను నిర్వహించడం వల్లే కేంద్ర బీజేపీ ప్రభుత్వం ముందుకు కదలకుండా నిలువరించగలిగామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే పరిశ్రమ పరిరక్షణ సాధ్యమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1184వ రోజుకు చేరాయి. దీక్షల్లో బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు. వారినుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణతో పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల రక్షణకు కూడా పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు చైతన్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు ఎన్.రామారావు, జె.రామకృష్ణ, ఆర్.వెంకటరావు, సన్నిబాబు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఘనంగా చందనోత్సవం

అక్కిరెడ్డిపాలెం: బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని ప్రసన్న వేంకటేశ్వరుడిని ప్రత్యేకంగా చందనంతో అలంకరించారు. చందన అలంకరణలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడిని మూడు రోజుల పాటు భక్తుల దర్శనార్థం ఉంచనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పలువురు పాల్గొన్నారు.



చందన అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో పద్మావతి అమ్మవారు, స్వామి

ఎస్టీబీఎల్‌లో..

షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అక్షయ తృతీయను పురస్కరించుకొని శుక్రవారం పద్మావతి అమ్మవారిని, తిరుమల బాలాజీని చందనంతో, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దివ్యక్షేత్రంలోని శ్రీవారి సన్నిధిలో మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేపట్టారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంగవరంలో ఇండియా కూటమి అభ్యర్థుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కూటమి పార్టీల కార్యకర్తలు

గాజువాక: ఈ ఎన్నికల్లో గాజువాక ఎమ్మెల్యేగా జగ్గునాయుడును, విశాఖ ఎంపీగా సత్యారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇండియా కూటమి పార్టీల నాయకులు గంగవరంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, నాయకులు ఎం.రాంబాబు, మోసా గురుమూర్తి, కె.అప్పలరాజు, కె.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

నీరు.. నిలవదిక

డెవలప్‌మెంట్ వాచ్

అభివృద్ధి ఏ ఒక్క అంశానికో పరిమితం కాకూడదన్న రాష్ట్రప్రభుత్వ సంకల్పంతో నియోజకవర్గంలో అన్ని వసతులపైనా దృష్టి సారించింది అధికార యంత్రాంగం. అందులో భాగంగా డ్రైనేజీలకు అనుసంధానంగా ఉండే కల్వర్టులు చాలా ప్రాంతాల్లో శిథిలస్థితిలో ఉండడంతో వాటి పునర్నిర్మాణాలపై దృష్టి సారించింది. పటిష్టంగా నిర్మించిన కల్వర్టులతో మురుగు కనుమరుగైంది. ఎంత వర్షం వచ్చినా నీరు నిలిచే పరిస్థితి లేదు. దీంతో నియోజకవర్గవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



66వ వార్డు కైలాసనగర్‌లోని అమృత నర్సింగ్ హోమ్ వద్ద గెడ్డపై రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్వర్టు. గతంలో ఇక్కడ 10 అడుగుల వెడల్పు కూడా లేని కల్వర్టును తొలగించి ప్రస్తుతం సుమారు 18 అడుగుల వెడల్పుతో నిర్మించారు. - గాజువాక



68వ వార్డు వివేకానంద కాలనీలో రూ.18 లక్షలతో నిర్మించిన కల్వర్టు - అక్కిరెడ్డిపాలెం



వడ్లపూడి ఎరుకుల వీధిలో 19.70 లక్షలతో నిర్మించిన ఆర్‌సీసీ బాక్స్ కల్వర్ట్ - అగనంపూడి



65వ వార్డు చాకలిగెడ్డ వద్ద కొత్తగా నిర్మించిన కల్వర్టు - పెదగంట్యాడ



68వ వార్డు అక్కిరెడ్డిపాలెం చర్చి వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టు - అక్కిరెడ్డిపాలెం

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం

పెదగంట్యాడ: పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసి వారి జీవనప్రమాణాలు మెరుగయ్యేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి అన్నారు. ఆ పథకాల కొనసాగింపుతో పాటు పేదలకు మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని, జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. 76వ వార్డు కోరాడలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో మహిళలతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. అమర్‌నాథ్‌కు గాజువాకపై పూర్తి అవగాహన ఉందని, ఆయన్ని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హిమగౌరి

ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. సమావేశంలో మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణ మూర్తి, చిక్కా సత్యనారాయణ, తాటికొండ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.